# చెయ్యి తిరగని రచయిత

శేఖర్ వర్ధమాన రచయిత. రచనా వ్యాసంగం ప్రారంభించి కొద్ది కాలమైనా, పుంఖాను పుంఖాలుగా రచనలు చేశాడు. నవలికలు, కథలు, కవితలు, మినీకథలు ఒకటేమిటి? అన్నీను. పైగా అతనిలో ప్రత్యేకత ఏమిటంటే, అతను రాసినవన్నీ అతనికి అమితంగా నచ్చేవే.

ఒక పత్రికనుండి తిరిగివచ్చిన కథ మరో పత్రికకు పంపేవాడు. మొదటిపేజీమీద "ఆర్" అని వ్రాస్తారు కాబట్టి దాన్ని తీసెయ్యడం, చివరి పేజీమీద పత్రికా కార్యాలయపు ముద్ర వేస్తారు కాబట్టి చివరిపేజీ చింపెయ్యడం, ఆ రెండు పేజీలు వ్రాసి మళ్ళీ మరో పత్రికకు "అవతల కోర్టులోనికి బంతి విసిరినట్లు" పంపడం జరుగుతూండేది. కాగితాలు రంగు మారకుండా, ఒకేరంగు కాగితాలు ఒక రీము కొని జాగ్రత్త చేసుకునే వాడు.

రచనలు తిరిగి వచ్చినందుకు బాధపడేవాడు కాదు కాని, ఆ తిరిగి రావడం ఎవరయినా చూస్తే, నవ్వితే అతనికి ఆత్మహత్య చేసుకోవాల న్నంత టెన్షన్ వచ్చేది.

ఒక ప్రముఖ పత్రిక నవలల పోటీ పెడుతోందని తెలిసి, కుడిచేయి నొప్పి పుట్టేవరకూ ఒక వారంరోజుల్లో ఒక నవల వ్రాసి ఆ పత్రికకు పంపాడు.

ఒక నెల తరువాత ఆ పత్రికనుండి తిరిగి వచ్చింది నవల.

శేఖర్ ఆ పత్రికవాళ్ళకు ఓ ఉత్తరం వ్రాశాడు.

"సంపాదకులకు

నమస్కారం—

నేను పంపిన "మోడుబారిన జీవితం" నవల తిప్పి పంపించారు

సంతోషం. కాని నేను వ్రాసిన ఆ నవలకు పదిహేనో పేజీ నుంచి కొన్ని పేజీలు పిన్ చేశాను. కనీసం ఆ పిన్ కూడా విప్పలేదు. మీ కార్యాలయంలో దీన్నిబట్టి మీరు వర్ధమాన రచయితల రచనలు అస్సలు చదవడంలేదని ప్రస్ఫుటంగా తెలుస్తోంది. నేను వర్ధమాన రచయితలందరి తరపున తీవ్ర నిరసన తెలియచేస్తున్నాను.

నాకు సమాధానం ఇస్తే సంతోషం—''

దీనికి పత్రికా కార్యాలయంనుండి కొన్ని రోజులకు జవాబు వచ్చింది.

''నమస్తే—

మా పత్రిక అంటే మీకుగల గౌరవాభిమానాలకు కృతజ్ఞతలు. మీ నవల పంపినందుకు చింతిస్తున్నాం. మా అభిరుచి మేరకు మీ నుండి రచనలు వస్తాయని ఆశిస్తున్నాము.

ఇకపోతే—

మీ నవల ''మోడుబారిన జీవితం'' గురించి మా సంపాదకవర్గంలో ఏ ఒక్కరూ మీ నవలను పిన్ చేసిన పేజీవరకు అయినా కనీసం చదవడానికి విఫలయత్నం చేశారని వ్రాయడానికి చింతిస్తున్నాము.

కృషి చేయండి బాగా. —ఎడిటర్

శేఖర్‌కి ఆ ఉత్తరం చదివాక ఒంట్లో రక్తమంతా ముఖంలోకి చిమ్మినట్లు ఎర్రగా అయిపోయింది.

...o....